సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 27 । మార్చి । 2023



నిరుపేద.. ఆపై పెద్ద బాధ
నిరుపేద కుటుంబం..ఆపై వారికి పెద్ద బాధ వచ్చింది. గర్భిణికి తలలో రక్తం గడ్డ కట్టింది..వెంటనే ఆపరేషన్ చేయకుంటే ప్రాణానికి ప్రమాదమని వైద్యులు చెప్పారు. -8లో..



'కళ' తప్పిన రంగస్థలం
సురభి పుట్టిన జిల్లాలో నాటకం కొడిగడుతున్న దీపంలా కొట్టుమిట్టాడుతోంది.భావితరాలు ఈ రంగం వైపు వచ్చే అవకాశాలు మూసుకుపోయాయి. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.120
రెండోరకం	రూ.56	రూ.88

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 246 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	500	506
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 102.98 కిలోలు



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ (సా॥)	సహర్ మంగళ (ఉ॥)
రాజంపేట	6.31	4.52
రాయచోటి	6.31	4.55
మదనపల్లి	6.32	4.56
పీలేరు	6.28	4.51

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో నేడు స్పందన

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 27వ తేదీన కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా సోమవారం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అంపైర్, స్కోరర్ పరీక్షలకు ప్రత్యేక తరగతులు

కడప స్పోర్ట్స్: క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ అంపైరింగ్, స్కోరింగ్ పరీక్షలకు హాజరయ్యే వారికి ప్రత్యేకశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సీఏవైడీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భరత్‌రెడ్డి, ఎ.రెడ్డిప్రసాద్ తెలిపారు. ఆసక్తి గలవారు ఏప్రిల్ 2వ తేదీలోగా తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9052748786, 9052004338 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి వైవీయూలో మిషన్ లెర్నింగ్‌పై సెమినార్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 27, 28 తేదీల్లో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ అప్లికేషన్స్' అన్న అంశంపై రెండురోజుల జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు వైవీయూ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ రెడ్డయ్య తెలిపారు. వైవీయూ వీసీ ఆచార్య జింక రంగజనార్ధన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి తదితరులు హాజరవుతారని చెప్పారు.

శివమొగ్గ-చెన్నై రైలు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: శివమొగ్గ- చెన్నై- శివమొగ్గ (రైలు నెం.06223/06224) మధ్య నడుస్తున్న రైలును మరో మూడు నెలలు పొడిగించారని కడప రైల్వే స్టేషన్ మేనేజర్ డి. నరసింహారెడ్డి, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా తెలిపారు. ఈ రైలు వారానికి రెండు సార్లు నడుస్తుందన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని కడప, ఎర్రగుంట్ల, రాజంపేట స్టేషన్లలో ఆగుతుందన్నారు.

ఉండమ్మా.. బొట్టు పెడతా.!

SAKSHI SPECIAL

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో తరతరాలుగా వింత ఆచారం కొనసాగుతోంది. మొరుసుకాపు తెగకు చెందిన మహిళలు కొద్దేవర బొట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఆచారం ఎందుకొచ్చింది.. ఎలా వచ్చింది అనే విషయాలు స్పష్టంగా తెలియకపోయినా తమ పూర్వీకుల కాలం నుంచి వస్తోంది కనుక తామూ ఆచరిస్తున్నామని.. ఇది శుభప్రదమని వారు పేర్కొంటున్నారు.

- మొరుసు కాపుల్లో వింత ఆచారం
- ఆనవాయితీగా కొద్దేవర బొట్లు
- శుభప్రదంగా భావిస్తున్న మహిళలు



తంబళ్లపల్లె మండలం దిగువగాలిగుంటపల్లెలో కొద్దేవర బొట్టు కార్యక్రమంలో మహిళలు

కురబలకోట: అన్నమయ్య జిల్లాలో మొరుసు కాపులున్న గ్రామాల్లో వింత ఆచారం కొనసాగుతోంది. కొందరు ఆరు నెలలకు.. మరికొందరు ఏడాదికోసారి మహిళలు కొద్దేవర బొట్టు కార్యక్రమం నిర్వహిస్తారు. నుదుట బొట్టు పెట్టించుకోవడమే కొద్దేవర బొట్టుగా వ్యవహరిస్తారు. పెళ్లయిన మహిళలు దీనిని చేయడం ద్వారా శుభ ప్రదంగా ఉంటుందన్న భావన కొనసాగుతోంది. దీన్ని తరతరాలుగా క్రమంగా ఆచరిస్తూ వస్తున్నారు. పూర్వీకుల నుండి ఇదొక ఆచారంగా స్థిరపడిపోయింది. ఈ ఆచారం ఆశ్చర్యపరుస్తుంది. పెద్దల ఆచారాన్ని నేటి తరం మహిళలు కూడా ఆచరిస్తూ గౌరవిస్తున్నారు. ఇది కుతూహలాన్ని కల్గిస్తుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల్లో మొరుసు కాపులున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో వీరు మరీ ఎక్కువగా ఉన్నారు. రెడ్డి కులస్తులలో వీరిది ఓ తెగ. ఈ ఆచారాన్ని మహిళలు తు.చ. తప్పకుండా ఆచరిస్తూ వస్తుండడం విశేషం. పెద్దలు మంచి ఆలోచనతో ప్రవేశపెట్టారని అందువల్లే తాము దీన్ని కొనసాగిస్తున్నామని మహిళలు చెబుతున్నారు. మహిళలు నుదుట బొట్టు పెట్టుకోవడం సాధారణమే అయినా ఈ కొద్దేవర బొట్టు విశిష్టమైనదే కాదు ప్రత్యేకమైనది.. అంతకంటే శుభ ప్రదంగా భావిస్తారు.

ఎప్పుడు చేస్తారంటే..

ఉగాది, నోముల పండగ రోజుల్లో బొట్టు దేవర కార్యక్రమం నిర్వహిస్తారు. శని, ఆదివారాల్లో మాత్రమే చేయడం పరిపాటి. ఉపవాసంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. బెల్లం, పసుపు, పచ్చి వడ్లు తదితర వాటిని నూరి మిశ్రమం తయారు చేస్తారు. దీన్ని బొట్టుగా పెట్టుకోడానికి పెద్దగా ఉన్న వారు అందజేస్తారు. అంతేకాదు తినడానికి కూడా ఈ మిశ్రమాన్ని ఇస్తారు. ఉగాది పండుగ నేపథ్యంలో ఆదివారం నియోజకవర్గంలోని పలు పల్లెల్లో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు బొట్టు స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఎర్రబల్లెలో దేవర పెద్దచే బొట్టు అందుకుంటున్న మహిళలు

ఆరోగ్యం..ఐక్యత.. అనురాగానికి ప్రతీక

తంబళ్లపల్లె: నియోజకవర్గంలోని మొరుసు కాపు రెడ్ల కుటుంబం మహిళలు భక్తిశ్రద్ధలతో నియమ, నిష్ఠగా నిర్వహించే కొద్దేవరబొట్టు కార్యక్రమం ఆరోగ్యం, ఐక్యత, అనురాగాలకు ప్రతీకగా నిలుస్తోంది. మండలంలోని ఎద్దులవారిపల్లె పంచాయతీ దిగువగాలిగుట్టపల్లెలో ఆదివారం గాలిగుట్ట దాయాది మహిళలు ఇలవేల్పుదేవత మద్దెమ్మ ఆలయం వద్ద కొద్దేవర బొట్టు కార్యక్రమాన్ని జరుపుకున్నారు. దేవర పెద్ద జయరామిరెడ్డి, భార్య పద్మావతమ్మలు కొద్దేవరబొట్టు మిశ్రమాన్ని తయారు చేసి మద్దెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెళ్లైన వారి నుంచి వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరికీ ఈ కొద్దేవరబొట్టును పంపిణీ చేశారు. వితంతువులకు సైతం ఈ బొట్టును పంపిణీ చేయడం విశేషం.

వంశపారంపర్యంగా వస్తోంది



కొద్దేవర బొట్టును మా గ్రామ మహిళలకు మా వంశస్తులు ఇచ్చేవారు. ఇది వంశ పారంపర్యంగా నాకు లభించింది. 15 ఏళ్లుగా నేను పెద్దగా ఉంటూ బొట్టు దేవర్లు నిర్వహిస్తున్నా. ఇది అదృష్టంగా భావిస్తున్నా.
–దేవరింటి సుబ్బమ్మ, దేవరపెద్ద, ఎర్రబల్లె, కురబలకోట మండలం

కొత్త వారికి కుతూహలం



ముత్యమంత పసుపు ముఖమంత ఛాయ..ముత్తయిదు కుంకుమ బతుకంత ఛాయ..అనే పాట స్ఫురణకు తెచ్చేలా ఈ కొద్దేవర బొట్టు కార్యక్రమం సాగుతుంది. కుల దేవత, దేవుడి గుడి వద్ద లేదా బండ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించడం పరిపాటి. కొందరు ఇళ్ల వద్ద కూడా నిర్వహిస్తారు. పెద్దగా ఉన్న ఆమె మహిళలకు బొట్టును అందజేస్తారు. దాన్ని వారు నుదుట బొట్టుగా పెట్టుకుని వెళతారు. దీన్ని ఎంతగానో గౌరవంగా భావిస్తారు. ఇది కొత్త కోడళ్లకు, కొత్తవారికి చూడ్డానికి కుతూహలంగా ఉంటుంది.
– బైసాని జ్యోతి, జెడ్పీటీసీ సభ్యురాలు, కురబలకోట మండలం

నాటి నుంచి నేటిదాకా..



పూర్వం ఎవరు ఎందుకు పెట్టారో..ఏమో కానీ నేటి తరం వారు కూడా దీన్ని పాటిస్తున్నారు. కట్టు బొట్టు మహిళలకు ప్రత్యేకత. ఇవి శోభను తెచ్చి పెడతాయి. అనాదిగా ఈ ఆచారం వస్తోంది. ఈ బొట్టు కార్యక్రమం ద్వారా మంచి జరుగుతుందని ఆపై శుభ ప్రదంగా భావిస్తారు.
– డీఆర్. నిర్మల, దాదంవారిపల్లె, కురబలకోట మండలం

హైదరాబాదు నుండి వచ్చా



కొద్దేవర బొట్టు కార్యక్రమం మొరుసు కాపుల్లో విడదీయరాని బంధంగా వస్తోంది. ఇప్పుడే కాదు భవిష్యత్తులోను కొనసాగుతుందన్న నమ్మకం ఉంది. తరాలుగా ఇది ఆచారంగా వస్తోంది. దేశంలో ఎక్కడున్నా ఇళ్లకు వస్తారు. నేను హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నా. దీని కోసం సంతోషంగా వచ్చా. ఈ దేవరతో దాయాదులు, బంధుమిత్రులు అందరూ ఒక చోట కలవడం, యోగక్షేమాలు మాట్లాడుకుంటారు. ఆప్యాయత, అనురాగాలు పెరుగుతాయి. పరోక్షంగా వారిలోని ఐకమత్యానికి నిదర్శనంగా కూడా నిలుస్తోంది
– ఆర్.జానకి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని, తూగువారిపల్లె, కురబలకోట మండలం

పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

వాల్మీకిపురం: వాల్మీకిపురంలో వెలసిన పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అంకురార్పణ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి మూలవర్లకు అభిషేకం, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన, మొదటి గంట, బలి, శాత్తుమొర తదితర సేవలను జరిపారు. సాయంత్రం ఆలయంలో కలశ స్థాపన, హోమాది కార్యక్రమాల అనంతరం అంకురార్పణ చేపట్టారు. అలాగే మధ్యాహ్నం 3 గంటలకు రామ భక్తులు శ్రీరామ దీక్ష వ్రతమాలను ధరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు క్రిష్ణమూర్తి, దుశ్యంత్ కుమార్, నాగరాజు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

- పట్టాభిరాముడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం ధ్వజారోహణం, ఊంజల్ సేవ, రాత్రి గజ వాహన సేవ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

డీడీ అచ్చెన్నది హత్యే.!

- కిడ్నాప్ చేసి.. హత్య చేశారు
- పశుసంవర్థక శాఖలో విభేదాలే కారణం
- కర్త, కర్మ, క్రియ డాక్టర్ సుభాష్ చంద్రబోస్
- పోలీసుల అదుపులో నిందితులు
- నేడో, రేపో మీడియా ముందుకు



అచ్చెన్న (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప/కడప అర్బన్: పశుసంవర్థక శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అచ్చెన్న అనుమానాస్పద మృతిని ఎట్టకేలకు పోలీసులు హత్యగా నిర్ధారించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్ పక్కా పథకం ప్రకారం ఈ హత్య చేసినట్లు తెలుస్తోంది. డాక్టర్ అచ్చెన్న శాఖాపరమైన వేధింపులే హత్యకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్నను ఒప్పందం చేసుకున్న మరో ఇరువురి సహకారంతో డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ కిడ్నాప్ చేసి, ఆపై పథకం ప్రకారం అంతమొందించాడు. బొలేరో వాహనంలో అచ్చెన్నను తీసుకెళ్లిన ముఠా అతనికి మద్యం తాపించి ఆ తర్వాత గువ్వలచెరువు ఘాట్‌లో ప్రొటెక్షన్ వాల్ మీద నుంచి కిందికి తోసేసినట్లు తెలుస్తోంది.

సూత్రధారి.. పాత్రధారి సుభాష్ చంద్రబోస్..

డాక్టర్ అచ్చెన్న హత్యలో సూత్రధారి.. పాత్రధారి డాక్టర్ సుభాష్ చంద్రబోస్ అని తేలినట్లు సమాచారం. బోస్‌కు దగ్గరి మనుషులు మరో ఇద్దరిని పురమాయించుకొని చర్చి నుంచి వస్తున్న అచ్చెన్నను వెంబడించి, మంచి మాటలు చెప్పి బొలేరో వాహనంలో ఎక్కించుకొని తీసుకెళ్లినట్లు సమాచారం. గువ్వలచెరువు ఘాట్‌కు అవతల వైపు రామాపురం పోలీసు స్టేషన్ పరిధిలో అందరూ కలసి మద్యం సేవించిన అనంతరం తిరుగు ప్రయాణం అయ్యారు. అప్పటికే ఆవేశంతో రగిలిపోతున్న బోస్ బృందం ఘాట్‌లోకి రాగానే, ఒక్కమారుగా 12 అడుగుల లోతున్న లోయలోకి తోసేసినట్లు తెలుస్తోంది. ముందుగానే మధుమేహ వ్యాధితో బాధపడుతున్న అచ్చెన్న అంత ఎత్తు నుంచి కిందపడిపోతే ఎలాగైనా మరణిస్తాడనే నమ్మకంతోనే అతన్ని చంపేందుకు ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు తెలిసింది. ముందు జాగ్రత్తగా అచ్చెన్న సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసినప్పటికీ చంద్రబోస్ సెల్‌ఫోన్ మాత్రం ఆన్‌లోనే ఉండటంతో అదే అతన్ని పట్టించినట్లు తెలుస్తోంది.

మిస్సింగ్ కేసు ఛేదించే క్రమంలో..

డాక్టర్ అచ్చెన్న రెండు రోజులుగా కన్పించడం లేదని ఆయన కుమారుడు డాక్టర్ క్లింటన్ చక్రవర్తి కడప ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిపార్టుమెంటు పరిధిలో ఉన్న గొడవల కారణంగా జేడీ శారదమ్మ, ఇరువురు ఏడీలు సుధీర్‌నాథ్ బెనర్జీ, శ్రీధర్ లింగారెడ్డి, చంద్రబోస్ మరి కొంత మందిపై అనుమానం ఉన్నట్లు ఆరోపిస్తూ 14వతేదీ పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు అందించారు. ఆమేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, అనుమానితులుగా ఉన్నవారు మూడు రోజులుగా ఎక్కడెక్కడ ఉన్నారు. రోజువారి వివరాలను వారి ద్వారానే పోలీసులు సేకరించారు. ఈ నేపథ్యంలో ఈనెల 24న గువ్వలచెరువు ఘాట్‌లో పడి ఉన్న గుర్తుతెలియని మృతదేహం డాక్టర్ అచ్చెన్నదిగా గుర్తించారు. దీంతో అనుమానితులుగా భావిస్తున్న వారు ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు వారి కదలికలకు సంబంధించి తమకు అందించిన సమాచారం సరిగ్గా ఉందా? లేదా? అని పోలీసులు క్రాస్ చెక్ చేశారు. ఈ క్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ ఫోన్ గువ్వలచెరువు టవర్ లొకేషన్ పరిధిలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తీగ లాగితే డొంక కదిలినట్లు మరో ఇరువురు ప్రైవేటు వ్యక్తుల సహకారంతో తానే ఈ హత్యకు పాల్పడినట్లు డాక్టర్ సుభాష్ చంద్రబోస్ పోలీసుల ఎదుట అంగీకరించినట్లు తెలుస్తోంది.

మరింత లోతుగా దర్యాప్తు..

డాక్టర్ అచ్చెన్న హత్యలో డాక్టర్ సుభాష్ చంద్రబోస్, మరో ఇరువురు కాకుండా ఇంకా ఎవరైనా సహకారం అందించారా? ప్రత్యక్షంగా పాల్గొన్నారా అన్న కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఇప్పటికే సీసీ ఫుటేజీల ఆధారంగా అచ్చెన్నను తీసుకెళ్లిన వాహనాన్ని గుర్తించినట్లు సమాచారం. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల పోలీసులు సంయుక్తంగా కేసును ఛేదించే పనిలో ఉన్నారు. నేడో రేపో మీడియా ముందు నిందితులను ప్రవేశ పెట్టనున్నట్లు సమాచారం.

మృతుని కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించాలి

- మందకృష్ణ మాదిగ డిమాండ్

కడప కోటిరెడ్డిసర్కిల్: పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న మృతికి కారకులను కఠినంగా శిక్షించడంతో పాటు మృతుని కుటుంబానికి రూ. కోటి పరిహారం అందించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి ఆయన జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. డాక్టర్ అచ్చెన్న హత్యకు కారకులైన వారు ఏ స్థాయిలో ఉన్నా కఠినంగా శిక్షించాలన్నారు. ఈ హత్యకు సంబంధించి కొంతమంది ప్రత్యక్షంగా, మరికొందరు పరోక్ష పాత్ర పోషించారని తెలుస్తోందన్నారు. ఉన్నత స్థాయి అధికారినే హత్య చేస్తే ఇక సామాన్య దళిత వర్గాలకు రక్షణ ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. అచ్చెన్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానితులందరిపై విచారణ జరిపించాలని కోరారు. ఈ సంఘటనపై సోమవారం అన్నమయ్య జిల్లా ఎస్పీని కూడా కలవనున్నట్లు ఆయన వివరించారు.



మీడియాతో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

కార్పొరేట్‌కు దీటుగా కస్తూర్బా


- అత్యుత్తమ విద్యాబోధన
- ఉచిత వసతి సదుపాయం
- ఏప్రిల్ 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- అడ్మిషన్లకు విపరీతమైన పోటీ

మదనపల్లె సిటీ: కార్పొరేట్‌కు దీటైన వసతులు.. అంతర్జాతీయ స్థాయి విద్యాప్రమాణాలు.. ఆంగ్ల మాధ్యమంలో బోధన .. పేదలు, అనాథలు, బడిబయట పిల్లలకు అడ్మిషన్లు...విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను ప్రారంభించారు. 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకు భరోసా ఇస్తున్నారు. బాలికలు సమాజంలో ఎలా మెలగాలో అవగాహన కల్పిస్తున్నారు. విలువలను పెంపొందించుకునేలా వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నారు. అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 21 కేజీబీవీల్లో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు ఈనెల ఈనెల 27 నుంచి ఏప్రిల్ 20 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం కల్పించింది. సీట్ల భర్తీలో నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీ వారీగా ప్రాధాన్యత ఇస్తారు. ప్రస్తుతం 6 వ తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం సీట్లను భర్తీ చేస్తారు.





తంబళ్లపల్లెలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం, గణతంత్ర దినోత్సవ సందర్భంగా జరిగిన సాంస్కృతిక పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకున్న కేజీబీవీ విద్యార్థులు (ఫైల్‌ఫొటో)



7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు అడ్మిషన్లు ఉంటాయి. దరఖాస్తును హెచ్‌టీటీపీఎస్://ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ సైట్ ద్వారా పొందవచ్చు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. ఇందు కోసం రాష్ట్ర విద్యా శాఖ ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించింది.

తరగతికి 40 మందే..

- కేజీబీవీలో 6 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో తరగతికి 40 సీట్ల చొప్పున కేటాయించారు.
- ఇంటర్మీడియట్‌కు సంబంధించి ఒక్కో కేజీబీవీలో ఒక్కో గ్రూపును ప్రవేశపెట్టారు. 40 సీట్ల చొప్పున అడ్మిషన్లు ఉంటాయి.
- ఆటలు, కరాటేలకు ప్రాధాన్యత ఇస్తారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ శిక్షణ ఇస్తారు.
- ఆరోగ్యం, నైతిక విలువలను పెంపొందించేలా వ్యక్తిత్వ వికాసం తరగతులను నిర్వహిస్తారు.
- ప్రతి కేజీబీవీలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరీక్షించడానికి ఒక ఏఎన్ఎం ఉంటారు.
- విద్యతో వెనుకబడిన వారిలో అభ్యసన నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తారు.
- కంప్యూటర్, వ్యాయామం, ఆరోగ్యం, వృత్తి నైపుణ్య విద్యను అందించడం ద్వారా బాలికల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేస్తారు.
- పదో తరగతి పూర్తి చేసుకున్న వారు ఉన్నత చదువులకు వెళ్లేలా ప్రోత్సహిస్తారు. అందులో భాగంగా కేజీబీవీల్లో ఇంటర్మీడియట్‌ను ప్రవేశపెట్టారు.

కేజీబీవీ ప్రత్యేకతలు: బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు వారంలో రెండు రోజుల పాటు స్వీయ రక్షణ లక్ష్యంగా కరాటే తరగతులు నిర్వహిస్తారు. కేజీబీవీల్లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఏటా ప్రతిభా అవార్డులను గెలుచుకుంటున్నారు. బాలికలకు కాస్మోటిక్ కిట్స్, నాప్‌కిన్స్‌లతో పాటు రెండు జతల యూనిఫారం ప్రభుత్వం అందిస్తోంది. కేజీబీవీ పాఠశాలల్లో బాలికల భద్రత కోసం వాచ్‌మెన్ నుంచి ప్రత్యేకాధికారి వరకు అందరూ మహిళా ఉద్యోగులే ఉంటారు.

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో కేజీబీవీ పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. విద్యార్థినులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. పేద, అనాథ, బడిబయట పిల్లలు, బడిమానేసిన బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. –పురుషోత్తం, జిల్లా విద్యాశాఖాధికారి, అన్నమయ్య జిల్లా

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన



కేజీబీవీ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన సాగుతోంది. మంచి భవనాలు, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు స్మార్ట్ డిజిటల్ తరగతుల ద్వారా బోధన ఉంటుంది. బాలికలకు భరోసాగా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. చదువుతో పాటు క్రీడలు, ఇతర నైపుణ్యాలకు మెరుగులు దిద్దుతాం. –శ్రీమతి, ప్రత్యేక అధికారిణి, కేజీబీవీ, తంబళ్లపల్లె

అన్ని వసతులతో కూడిన ఉత్తమ విద్య



కేజీబీవీలో అన్ని వసతులతో కూడిన ఉత్తమ విద్యాబోధన జరుగుతోంది. ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన విద్య కల్పిస్తున్నారు. నాణ్యమైన భోజనం, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో మేము విద్యను అభ్యసిస్తున్నాం. –మౌనిక, 9వతరగతి విద్యార్థిని, కేజీబీవీ, పీటీఎం

'కళ' తప్పిన రంగస్థలం

- కొడిగడుతున్న నాటక దీపం
- నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం

కడప కల్చరల్ : సురభి పుట్టిన జిల్లాలో నాటకం కొడిగడుతున్న దీపంలా కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు ఎంతో వైభవంగా చూసిన ఈ నేలపై.. నాటకం ఆనవాళ్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. భావితరాలు ఈ రంగం వైపు వచ్చే అవకాశాలు దాదాపు మూసుకుపోయాయి. సోమవారం ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రస్తుతం నాటకరంగం తీరుతెన్నులపై ప్రత్యేక కథనం.

ప్రస్తుతం రంగస్థల నాటకం దయనీయ స్థితిలో ఉంది. ఒకప్పుడు 30కి పైగా నాటక సంస్థలు ప్రతి మాసం ప్రదర్శనలిస్తూ ఉండేవి. కడప నగరంతో పాటు రాజంపేట, నందలూరు, ప్రొద్దుటూరు, రాయచోటిలలో తరుచూ ప్రదర్శనలు జరుగుతుండేవి. ప్రస్తుతం రెగ్యులర్‌గా నాటకాలు ప్రదర్శించే సంస్థలు లేవనే చెప్పక తప్పదు. నాడు కడపలో పాత రంగస్థలంతోపాటు చెన్నూరు బస్టాండు వద్ద రామకృష్ణ సమాజం, పాత బస్టాండులోని ఎన్జీఓ హోం, అప్పుడప్పుడు కడప నగరంలోని సీఎస్ఐ హైస్కూలు కూడా నాటక ప్రదర్శనలకు వేదికలుగా విలసిల్లాయి. పలు నాటక సంస్థలు కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా పలుమార్లు నాటక పరిషత్తులను కూడా నిర్వహించాయి. దాదాపు 30కి పైగా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక నంది అవార్డులు, టీటీడీ గరుడ అవార్డులను సాధించాయి. కానీ నేడు ఈ వేదికలన్నీ నాటకానికి దూరమయ్యాయి. సినిమాలను తట్టుకుని నిలిచిన నాటకరంగం టీవీల దెబ్బకు కళ తప్పిందని పలువురు పేర్కొంటున్నారు. పౌరాణికంలో రిహార్సల్స్ తక్కువ గనుక టీవీ పోటీని కూడా తట్టుకుని నిలబడగలిగింది. నేటికీ గ్రామాల్లో గాత్ర శుద్ధిగల యువతతోపాటు వృద్ధులు కూడా పౌరాణిక నాటకాలు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.


పౌరాణిక నాటకంలోని ఓ దృశ్యం (ఫైల్)

ఉర్దూ నాటకానికి 'పరదా'

జిల్లాలో ఉర్దూ నాటకం కూడా క్రమంగా కనుమరుగైంది. ఏటా రెండు, మూడుసార్లు ప్రదర్శించిన ఉర్దూ నాటకం ఇప్పుడు రెండు, మూడేళ్లకు ఒకటి కూడా కనిపించడం లేదు. అభిరుచిగల కళాకారులు కనుమరుగు కావడం, అభినివేశం గల వారు వృద్ధులు కావడం, కొత్త తరం ఇటువైపు చూడకపోవడంతో ఉర్దూ నాటకానికి పరదా పడింది. ముఖ్యంగా కడప నగరంలో ప్రముఖ ఉర్దూ కవి, రచయిత యూసఫ్ సఫీ తన నాటక రచన, ప్రదర్శనలతో సహచరులను ఎప్పటికప్పుడు ఉత్తేజ పరిచేవారు. ఆయన గతించడంతో ఉర్దూ నాటకం అక్కడే ఆగిపోయింది.

ఉన్నా లేనట్లే!

నాటకం వేసేందుకు ఎవరైనా ముందుకు వస్తే వారికి రంగ స్థలాలు దొరకడం కష్టమైంది. నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రాన్ని లక్షలాది రూపాయలతో ఆధునికీకరించినా అద్దె ఎక్కువ అంటూ కళాకారులు ఆ వైపు రావడం లేదు. తప్పనిసరి అయితే బ్రౌన్ గ్రంథాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. దీంతో కళాక్షేత్రం నిర్వహణ కూడా బరువుగా మారింది. వైఎస్సార్ పేరిట నిర్మించిన ఆడిటోరియంలో నాటకం ప్రదర్శించి రెండు, మూడేళ్లు కావస్తోంది. ప్రొద్దుటూరులో కూడా ఇటీవల నాటకం జాడలేదు. రాజంపేట, నందలూరు, బద్వేలు, ఇతర పట్టణాలలో కూడా పరిస్థితి అలాగే ఉంది.

ఆశావహ స్థితి

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన యోగి వేమన విశ్వవిద్యాలయంలో లలిత కళల విభాగం ప్రత్యేకించి రంగస్థల కళల విభాగం ఈ రంగంపై ఆశలను సజీవంగా ఉంచుతోంది. ఇప్పటికి దాదాపు 10 నాటికలు, నాటకాలను ఆ విభాగ విద్యార్థులు ప్రశంసనీయంగా ప్రదర్శించారు. ఈ కోర్సులకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. ఇటీవల నృత్యం, సంగీతం విభాగాలను కూడా ఏర్పాటు చేసి నగరవాసుల కోసం నగరంలోని కళాశాలల్లో శిక్షణ అందుబాటులోకి రావడంతో నాటక విభాగానికి కూడా ఆదరణ పెరుగుతోంది. యునైటెడ్ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇటీవల ఉన్నత విద్యా సంస్థల్లో కళారూపాల శిక్షణను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించడం, ఈ దశలో నాటకం పట్ల కొత్త ఆశలను రేపుతోంది.

సహకారం కావాలి



కళల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం, ముఖ్యంగా ఆర్థిక ప్రోత్సాహం అవసరం. ఇది వృత్తిగా లాభించదన్న అభిప్రాయంతో యువత ముందుకు రావడం లేదు. ఆర్థిక ప్రోత్సాహం ఉన్నప్పుడే రచయితలు, దర్శకులు, నటుల్లో కూడా ఆసక్తి పెరుగుతుంది. నాటకం మనుగడ సాగిస్తుంది. వైవీయూలో నాటక రంగ విభాగానికి ఊహించనంత డిమాండ్ ఏర్పడటంతో దీనికి మంచి భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకం పెరిగింది.

– ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, రంగస్థల కళల విభాగం, వైవీయూ, కడప

క్లుప్తంగా

అమర వీర జవాన్ విగ్రహ ఆవిష్కరణ


విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని రాచపల్లె గ్రామంలో కొండూరు సరోజనమ్మ, కొండూరు జయరామరాజు జ్యేష్ట పుత్రుడు అమర వీర జవాన్ లాన్స్‌నాయక్ కొండూరు యుగంధర్ విగ్రహాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, బెంగళూరుకు చెందిన సతీష్‌కుమార్ ఆవిష్కరించి, భారత మిలటరీ పద్ధతిలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ రాష్ట్రపతి అవార్డు గ్రహీత, దేశం కోసం ప్రాణాలు వదిలిన వీర జవాన్ లాన్స్‌నాయక్ కొండూరు యుగంధర్ దేశం గర్వించదగ్గ వ్యక్తి అని, తాను ఎంచుకున్న మార్గంలో తన ప్రాణాలను కూడా లెక్క చేయని వ్యక్తి అని కొనియాడారు. ఆయన భావితరాలకు ఆదర్శమూర్తి అన్నారు. అనంతరం బెంగళూరుకు చెందిన సతీష్ కుమార్ మాట్లాడుతూ 2003లో 6932 మీటర్లు గల కైలాస పర్వతం అధిరోహించి అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా సాహస అవార్డు అందుకున్నారని తెలిపారు. 2005లో 7138 మీటర్ల గల చాకుంభా–1 పీక్ అనే ఎత్తయిన శిఖరాన్ని అధిరోహిస్తూ భారత జాతి కీర్తిని హిమ శిఖరాలకు చేర్చే క్రమంలో కొండ చరియలు విరిగిపడి వీరమరణం చెందాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఎం. ఓబులేసు, బి.కృష్ణయ్య, శేఖర్, శ్రీనివాసులరెడ్డి, చంద్రాయుడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దంపతులపై దాడి

మదనపల్లె : చేపల చెరువు వద్ద జరిగిన ఘర్షణలో కొందరు వ్యక్తులు దంపతులపై దాడికి పాల్పడిన సంఘటన వాల్మీకిపురం మండలంలో జరిగింది. నగిరిమడుగు పంచాయతీ చిన్ననారాయణపల్లెకు చెందిన దంపతులు రమణయ్య (50), రమాదేవి (45) వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. రమణయ్య కుమారుడు నాగరాజ గ్రామ సమీపంలోని ఓ చెరువులో ఆదివారం చేపలు పడుతుండగా, అదే గ్రామానికి చెందిన రఘు, శీన ఘర్షణకు దిగారు. ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అయితే కుమారుడు నాగరాజుకు అడ్డుగా వెళ్లిన దంపతులు రమణయ్య, రమాదేవిపై రఘు, శీన, వెంకటరమణ, అన్నయ్య, లక్ష్మీదేవి కర్రలతో దాడి చేసి గాయపరిచారు. బాధితులను 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బ్యాగ్ లాక్కెళ్లిన దొంగలు

బి.కొత్తకోట : కర్ణాటకలోని కొత్తవుడియంకు చెందిన భారతమ్మ ఆదివారం బి.కొత్తకోట–గుడిపల్లె మార్గంలోని మరవపల్లె క్రాస్ వద్ద ఉండగా దొంగలు బ్యాగ్‌ను లాక్కొని వెళ్లినట్టు ఆమె అల్లుడు జనార్దనరెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం బట్లపల్లె నుంచి కొత్తవుడియం వెళ్లేందుకు బస్సు కోసం వేచి వుండగా.. రెండు బైక్‌ల్లో వచ్చిన వారు హ్యాండ్ బ్యాగ్ లాక్కెళ్లారు. ప్రయాణ ఖర్చుల కోసం ఉంచుకున్న రూ.5 వేలు అందులో ఉన్నాయని బాధితురాలు వాపోయింది. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రామమోహన్ చెప్పారు. అయినప్పటికీ వివరాలు సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు తక్షణమే తమకు సమాచారం అందిస్తే నిందితులను పట్టుకుంటామని పేర్కొన్నారు. తానామిట్ట, పెద్దతిప్పసముద్రం చెక్‌పోస్టు పోలీసులను అప్రమత్తం చేసి, అప్పటికప్పుడే పట్టుకుని ఉండేవాళ్లమని వివరించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. రామసముద్రంకు చెందిన భాస్కర్ (22), విజయకుమార్ (26) శనివారం రాత్రి వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో కర్ణాటకలోని ముళబాగల్‌కు బయలుదేరారు. మార్గంమధ్యలో కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి బోల్తా పడ్డారు. ఈ ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడ్డారు. అదేవిధంగా నిమ్మనపల్లె మండలం బాలేవాండ్లపల్లెకు చెందిన రమణ (40) ఆదివారం ద్విచక్రవాహనంలో మదనపల్లె నుంచి స్వగ్రామానికి వెళుతుండగా, మార్గంమధ్యలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రమణ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో స్థానికులు గమనించి బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రాణం తీసిన సరదా


మృతి చెందిన విద్యార్థి పండు


రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

మదనపల్లె : సెలవు రోజున సరదాగా స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని కృష్ణానగర్‌కు చెందిన నిమ్మ మహేష్, రాణి దంపతుల కుమారుడు ఎన్.పండు(13) స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవుదినం కావడంతో స్నేహితులతో కలిసి మండలంలోని కోళ్లబైలు పంచాయతీ మామిడిగుంపులవారిపల్లె సమీపంలోని చెరువు వద్దకు ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా జేసీబీతో తీసిన లోతైన గుంతల్లో స్నేహితులు ఈత కొడుతుండగా, తనకు ఈత రాకపోవడంతో గట్టు పట్టుకుని ఈత నేర్చుకునేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగాడు. గమనించిన స్నేహితులు గట్టుకు వచ్చి ప్రమాద విషయాన్ని స్థానికులకు తెలపడంతో కాపాడేందుకు ప్రయత్నించారు. అప్పటికే పండు నీట మునిగిపోవడంతో మృతదేహాన్ని వెలుపలికి తీసుకువచ్చి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు బోరున ఏడుస్తూ... 'ముగ్గురు ఆడపిల్లల తర్వాత పుట్టిన ఒక్కగానొక్క మగ సంతానాన్ని అల్లారుముద్దుగా పెంచుకుంటే అనాథలను చేసి వెళ్లిపోయావా బిడ్డా' అంటూ విలపించడం స్థానికులను కలిచివేసింది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.

నిరుపేద.. ఆపై పెద్ద బాధ

- తలలో గడ్డతో తల్లడిల్లుతున్న గర్భిణి
- వెంటనే ఆపరేషన్ చేయాలన్న వైద్యులు
- రూ.2.50 లక్షలు అవసరం
- దాతల సాయం కోసం ఎదురుచూపు

ప్రొద్దుటూరు క్రైం : నిరుపేద కుటుంబం.. ఆపై వారికి పెద్ద బాధ వచ్చింది. గర్భిణికి తలలో రక్తం గడ్డ కట్టింది.. వెంటనే ఆపరేషన్ చేయకుంటే చిన్న ప్రాణంతోపాటు పెద్ద ప్రాణానికి ప్రమాదమని వైద్యులు చెప్పారు. ఈ సమయంలో చేతిలో చిల్లి గవ్వ కూడా లేని ఈ పేద ముస్లిం కుటుంబం సాయం కోసం ఎదురు చూస్తోంది. పవిత్ర రంజాన్ మాసంలో దాతలు దయతలిస్తే.. తల్లీబిడ్డలను కాపాడుకుంటానని ఆమె భర్త ప్రాధేయపడుతున్నాడు. ప్రొద్దుటూరులోని శ్రీనివాసనగర్‌కు చెందిన షేక్ సుభాన్ ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నాడు. అతనికి సత్తాజ్‌బీతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వారికి సానియా అనే రెండేళ్ల పాప ఉంది. మొదట కుమారుడు పుట్టి అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. కొన్ని నెలల క్రితం ఆమె మళ్లీ గర్భం దాల్చింది. అందుకు సంబంధించిన పరీక్షలు చేయించే క్రమంలో అధిక బీపీతోపాటు తలలో రక్తం గడ్డకట్టినట్లు స్కానింగ్‌లో నిర్ధారణ అయింది. దీంతో వైద్యుల సూచన మేరకు సత్తాజ్‌బీని కర్నూలులోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు. పరిశీలించిన అక్కడి వైద్యులు తలలో గడ్డ ఉండటం మూలాన కడుపులో ఉన్న బిడ్డకు కూడా ప్రమాదమని తెలిపారు. అయితే దీనికి శస్త్ర చికిత్స ఇక్కడ చేయడం కుదరదని, ఇది ఎంతో రిస్కుతో కూడుకున్నదని వైద్యులు చెప్పారు. వేలూరు సీఎంసీ ఆస్పత్రికి వెళ్లితే మెరుగైన చికిత్స లభిస్తుందని సూచించారు. ఇప్పటికే సత్తాజ్‌బీ వైద్యం కోసం భర్త సుభాన్ పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టాడు. ఇక చేతిలో చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితుల్లో వార్డు కౌన్సిలర్ జిలాన్ ద్వారా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారి కుటుంబ, సత్తాజ్‌బీ ఆరోగ్య పరిస్థితి చూసి చలించిన ఎమ్మెల్యే రాచమల్లు రూ. 95 వేలు అందజేశారు.


షేక్ సత్తాజ్‌బీ

ఈ నెల 29న ఆపరేషన్‌కు రమ్మన్నారు..

తమిళనాడులోని వేలూరు సీఎంసీ హాస్పిటల్‌కు సుమారు 9 నెలల పాటు తిరిగామని, ప్రతి నెల రూ.20 వేలు వరకు ఖర్చు అయినట్లు సుభాన్ తెలిపాడు. ఈ క్రమంలోనే ఈ నెల 29న సత్తాజ్‌బీ తలలో ఉన్న గడ్డకు ఆపరేషన్‌తోపాటు సిజేరియన్ చేయాల్సి ఉందన్నాడు. ఇందుకోసం రూ. 2 లక్షలు నుంచి రూ.2.50 లక్షలు ఖర్చు అవుతుందని సీఎంసీ ఆస్పత్రి వైద్యులు చెప్పారన్నారు. మానవతా దృక్పథంతో సాయం చేస్తే తన భార్యా బిడ్డలను బతికించుకుంటానని సుభాన్ అంటున్నాడు. ఈ నిరుపేద ముస్లిం కుటుంబానికి 8463929731 అనే (గూగుల్‌పే, ఫోన్‌పే నంబర్) నంబర్‌కు ఫోన్ చేసి ఆర్థిక సాయం చేయాలని సుభాన్, సత్తాజ్‌బీ దంపతులు కోరుతున్నారు.

గాలి, వానకు అరటి పంట ధ్వంసం

- 80 ఎకరాల్లో విరిగిన చెట్లు
- కోటి యాభై లక్షల రూపాయల నష్టం


దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారిణి ఆషియా

ఓబులవారిపల్లె : మండలంలో శనివారం సాయంత్రం గాలివానకు 80 ఎకరాల్లో అరటి తోటలు ధ్వంసం అయ్యాయి. ఆదివారం ఉద్యానవన శాఖ అధికారిణి ఆషియా సిబ్బందితో కలిసి పరిశీలించి పంట నష్టాన్ని నమోదు చేశారు. శనివారం సాయంత్రం గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. చాలా చోట్ల అరటి చెట్లు విరిగి పడ్డాయి. పెద్దఓరంపాడు, రాళ్లచెరువుపల్లె, గోబ్బురువారిపల్లె, చిన్నఓరంపాడు, గాదెల గ్రామాల్లో మొత్తం 80 ఎకరాల్లో అరటి పంట దెబ్బతిన్నట్లు అధికారిణి ఆషియా తెలిపారు. మామిడి చెట్లకు పూత రాలి పోయిందని ఆమె పేర్కొన్నారు. దాదాపు కోటి యాభై లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు చెప్పారు. బాధిత రైతుల వివరాలు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని వివరించారు.

అవమానం తట్టుకోలేక ఆత్మహత్య


అక్బర్‌బాషా(ఫైల్)

ములకలచెరువు : ములకలచెరువులో ఓ వ్యక్తి అవమానం తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఉమాశంకర్ కాలనీకి చెందిన ఎస్.అక్బర్‌బాషా, ఎస్.హుసేన్‌బీలు దంపతులు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. అక్బర్‌బాషా స్థానికంగా ఉన్న బేకరీలో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరి ఇంటి సమీపంలో ఉన్న వై.వినోద్‌కుమార్‌తో హుసేన్‌బీ కొంత కాలంగా చనువుగా ఉంటోంది. ఈ నెల 23న వీరిద్దరూ మాట్లాడుకుంటున్న సమయంలో చూసిన అక్బర్‌బాషా భార్యను మందలించాడు. ఈ విషయం తెలుసుకున్న వినోద్‌కుమార్.. అక్బర్‌బాషాతో గొడవపడ్డాడు. గమనించిన చుట్టు పక్కల వారు ఇద్దరినీ మందలించి పంపించి వేశారు. ఇంతటితో ఆగని వినోద్‌కుమార్ రెచ్చిపోయి అక్బర్‌బాషా ఇంటి వద్దకు వెళ్లి గొడవపెట్టుకున్నాడు. అవమానం తట్టుకోలేక మనస్తాపానికి గురైన అక్బర్‌బాషా(36) తన చావుకు వినోద్‌కుమార్ కారణం అంటూ ఫేస్‌బుక్‌లో వీడియోను పోస్టు చేసి.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అక్బర్‌బాషా తండ్రి ఎస్.బాషా ఎస్‌ఐ డీవై స్వామికి సమాచారం అందించారు. అక్బర్‌బాషా మృతదేహాన్ని పరిశీలించిన ఎస్‌ఐ చుట్టు పక్కల వారిని విచారణ చేశారు. అనంతరం ఎస్.బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా హాస్పిటల్‌కు మృతదేహాన్ని తరలించారు.

పొలం వదలకపోతే చంపేస్తామని బెదిరింపులు

మహిళా రైతు భర్తతో కలిసి డీఎస్పీకి ఫిర్యాదు

నిమ్మనపల్లె : సాగు చేసుకుంటున్న పొలాన్ని వదిలేయకపోతే చంపేస్తామంటూ కొందరు బెదిరిస్తున్నారని రాచవేటివారిపల్లెకు చెందిన మహిళారైతు బిడ్డల మంజుల భర్త శ్రీధర్‌రెడ్డితో కలిసి ఆదివారం డీఎస్పీ కేశప్పకు ఫిర్యాదు చేసింది. రాచవేటివారిపల్లె సర్వే నంబర్: 701/2లో తమకు 4.98 ఎకరాల పొలం ఉందని, భూమికి సంబంధించిన అన్ని రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ తదితర ధ్రువపత్రాలు ఉన్నాయన్నారు. తమకు ఉన్నటువంటి పొలాన్ని సాగు చేసుకుంటూ, పాడిపశువులను మేపుకొంటూ పొలం వద్దే నివసిస్తున్నామన్నారు. అయితే పుంగనూరుకు చెందిన బి.ఈశ్వర్‌రెడ్డి, ఆయన తల్లి బి.రెడ్డికుమారి స్థానికులైన మరికొందరితో కలిసి తమపై దౌర్జన్యం చేస్తున్నారని పేర్కొన్నారు. సదరు భూమిపై ఇరువర్గాల మధ్య మదనపల్లె కోర్టులో కేసు నడుస్తోందన్నారు. అయితే ఆ భూమి తమదేనని, మీరు పొలం వదలకపోతే చంపేస్తామని బెదిరించి పొలం వద్దకు రాకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. స్పందించిన డీఎస్పీ కేశప్ప వెంటనే నిమ్మనపల్లె పోలీసులకు సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఆమేరకు హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి సమస్యను పరిష్కరించారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం


ఐక్యత చాటుతున్న దళిత నేతలు

రాజంపేట : దళితులు ఐకమత్యంతో ముందుకెళ్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు దళితనేతలు తెలిపారు. ఆదివారం ఎస్సార్ కల్యాణ మండపంలో మాలల జేఏసీ ఆధ్వర్యంలో ఉభయ జిల్లాల దళితుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు జాతీయ గౌరవ అధ్యక్షుడు యమాల సుదర్శన్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగంసంజీవ్, గల్ఫ్ రాయలసీమ అసోసియేషన్ అధినేత దుగ్గి గంగాధరం, మాలమహానాడు గాలి శెట్టి సుధాకర్, నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచి జంబు సూర్యనారాయణ, దళిత ఐక్యవేదిక రాష్ట్రనాయకుడు ఆర్ముగం విశ్వనాథ్, ఏపీజీబీ మాజీ మేనేజరు పిల్లి చంద్రశేఖర్, ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబరు పెనుబాల నాగసుబ్బయ్య మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో దళితులు సత్తా చాటాలన్నారు. దళితుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా మాలల జేఏసీ పని చేస్తుందని స్పష్టం చేశారు.

అంబేడ్కర్‌కు నివాళి

పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దళిత నాయకులు కాకిచంద్ర, పాపయ్య, చంద్రమౌళి, కొండాపురం మనోహర్‌బాబు, దాసరి పెంచలయ్య, మోడపోతుల రాము, బియ్యాల రమణ, అన్నమయ్య జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు శివయ్య, రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షుడు నరేష్, జైభారత్ రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, మాలమహానాడు నాయకులు బండేపల్లె రమణయ్య, సీపీఎం దళిత నాయకుడు పందికాళ్ల సుబ్రమణ్యం, ఓబిలి పెంచలయ్య, చిత్తూరు, తిరపతి, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలకు చెందిన మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటుసారా, కర్ణాటక మద్యం స్వాధీనం

నలుగురి అరెస్ట్


సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ పోలీసులు

మదనపల్లె : మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని నిమ్మనపల్లె, మదనపల్లె మండలాల్లో నిర్వహించిన తనిఖీల్లో 45 లీటర్ల నాటుసారా, 96 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్ట్ చేశారు.

ఇన్‌చార్జి సీఐ శ్రీహరిరెడ్డి ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. నిమ్మనపల్లె మండలం మదనపల్లె–నిమ్మనపల్లె రహదారిపై గారబురుజుక్రాస్ వద్ద దిగువమాచిరెడ్డిగారిపల్లెకు చెందిన సీతారాములు కుమారుడు దామోదర్(29) నుంచి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లె మండలంలోని కోళ్లబైలు దారిలో గాంధీపురానికి చెందిన గోపి కుమారుడు మణి(45), తుమ్మలతండాకు చెందిన శంకర్‌నాయక్ కుమారుడు బుక్యా భానుప్రకాష్ నాయక్(19)లు 40 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా అరెస్ట్ చేశారు. అలాగే శనివారం రాత్రి వేంపల్లె శాస్త్రులగడ్డకు చెందిన వెంకటరమణ కుమారుడు బండి హరికృష్ణ(37) హైవార్డ్స్ చీర్స్ విస్కీ(90ఎం.ఎల్) 96 టెట్రా ప్యాకెట్లను కర్ణాటక నుంచి అక్రమంగా తీసుకువస్తుండగా బార్లపల్లె వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ మూడు ఘటనల్లో నలుగురిని అరెస్ట్ చేశారు. సారా, కర్ణాటక మద్యంను సీజ్ చేశారు. దాడుల్లో మదనపల్లె ఎస్ఈబీ ఎస్‌ఐ అంజాద్‌బాషా, ఈఎస్‌ఐ, బార్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో శాప్ ఎండీ

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామాలయంలోని సీతారామలక్ష్మణ మూర్తులను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ(శాప్) వైస్ చైర్మన్, ఎండీ కె.హర్షవర్ధన్ (ఐఏఎస్) ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయనను అర్చకులు సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు శాప్ ఎండీ వైఎస్సార్ జిల్లాలోని కడపలో పర్యటించారు. వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలను పరిశీలించారు.